వినుత హాస్టల్ నుండి వచ్చి ఇంట్లో ఉన్న రోజుల్లో అయినా నాతో సుందరీ వాళ్ళింటికి రావడానికి ఇష్టపడేది కాదు. సుందరి కొడుక్కి అయిదో నెల వచ్చినా, వాళ్ళాయనకు ఉద్యోగం వచ్చే వరకూ ఇక్కడే ఉండమన్నారట ఆమె అత్తగారు వాళ్ళు.

వినుత 'మీరిద్దరూ చంటి పిల్లాడి ముచ్చట్లలో మునిగిపోతారు. నాకు బోర్' అంటూ నాతో ఎప్పుడూ రాకపోవటంతో నాపని సులువైంది! నేను రాగానే సుందరి వాళ్ళింటికి వెళ్ళడానికి తొందరపడుతున్నానని అమ్మ ఒకసారి నవ్వుతూ 'చంటి పిల్లలంటే ఇంత ముచ్చటపడుతున్నావు.. ముహూర్తాలు పెట్టించెయ్యమని మీ అత్తమ్మకు చెప్పమంటావా?' అంది. నవ్వేసి ఊరుకున్నాను. రాజు వాళ్ళింటికి వెళ్తున్నాననే విషయం సుందరికి తప్ప ఇంకెవరికీ తెలిసే అవకాశం లేకపోయింది.

అమ్మ ఫోనులో మాట్లాడినప్పుడు ఊళ్ళో ఎవరో దూరపు బంధువుల పెళ్ళి గురించి చెప్పింది. ఆ పెళ్ళికి నేనూ వెళ్ళొస్తానని అత్తమ్మని అడిగితే "ఊళ్ళోనే కాబట్టి మీ అమ్మా వాళ్ళు వెళ్తారు. నువ్వూ వెళ్ళాల్సిన అవసరం లేదులే.." అంది "రజిత వాళ్ళ అమ్మకి బంధువులట. వాళ్ళు వస్తున్నారు. రజితను చూసి చాలా రోజులైందిగా.. అందుకే వెళ్దామని ఉంది" అనేసరికి అత్తమ్మ వెళ్ళిరమ్మంది.

నేను పెళ్ళికి రెండు రోజుల ముందుగానే బయలుదేరి వెళ్ళిపోయాను.

ఆరోజు ఊళ్ళో యువజన సంఘం కుర్రాళ్ళు రచ్చబండ దగ్గిర నాటిక వేస్తున్నారని వెళ్దామని సుందరి అంటే నేనూ వెళ్ళాను.

నాటక ప్రదర్శన అంటే పెద్ద హడావుడేం లేదు. చెట్టు కొమ్మలకే నాలుగు బల్బులు వేళ్ళాడదీశారు. చెట్టూ చుట్టూ ఉన్న బండే స్టేజి. మేకప్పు గొడవ లేకుండా, పాత్రల వయసు తెలియజేయటానికి చిన్న చిన్న మార్పులు.. పంచె కట్టుకుని, కండువా వేసుకోవడంలాంటి వేషధారణ మాత్రం చేశారు.

ఆ నాటికను రాజే రాశాడట. అందరూ సమష్టిగా కృషి చేసి తమ ఊరుని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలనే సందేశం ఉంది! చెప్పదలచుకున్న విషయాన్ని హాస్యభరితంగా చెప్పటంతో ప్రతీ డైలాగుకీ నవ్వులూ, చప్పట్లే! పనులు చేసుకునే వాళ్ళు, రైతులు చాలా మందే వచ్చారు. ఆడవాళ్ళల్లో పెద్దవాళ్ళు కొద్ది మందే ఉన్నారు. ముందు అయిదారు కుర్చీలు వేసి ఉన్నాయి. నాటిక మధ్యలో అటు వేపు వెళ్తున్న మా నాన్నని ఎవరో రమ్మని పిలిచి తీసుకువచ్చి కుర్చీలో కూర్చోబెట్టారు. మేం కూర్చున్న చోట కొంచెం చీకటిగా ఉంది కాబట్టి నాన్నకి కనుపించే ప్రమాదం లేదని తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

నాటిక ఆఖరులో ఒక కవిత ఉంది. రాజు నాన్న వేపే సూటిగా చూస్తూ చెబుతున్నట్లుగా నాకు అనిపించింది! ఇంటికి వచ్చాక కూడా ఆ పదాల్ని మళ్ళీ మళ్ళీ స్మరించుకున్నందువలనేమో అంతా కాకపోయినా చాలా వరకు గుర్తుంది.

వంచన అనే ముళ్ళ కంచెను తెగ త్రెంచు...
మంచితనపు మల్లె తీగను మనసారా పెంచు...
స్వార్థ శక్తులపై సమరాన్ని సాగించు..
సమ సమాజ స్థాపనకై నడుం బిగించు.
పదుగురి ప్రయోజనం కోసం నీ సాయం అందించు...
పల్లె తల్లి రుణం తీర్చగ స్వేదం చిందించు..
అవినీతి అరాచకాల్ని ఎదిరించు...
విజయాలెన్ని సాధించినా వినయంగా తలవొంచు..

అందరూ ఆగకుండా రెండు నిముషాల సేపు చప్పట్లు కొడుతూనే ఉన్నారు!

రాజు క్రిందికి దిగి వచ్చి "మామయ్యా... మా నాటకం ఎలా ఉంది?" అనడగటం వెనకే ఉన్న మాకు బాగానే వినిపించింది.

"ఇలాంటి చించు కవిత్వాలు మానేసి... సొంతానికి సెంటు భూమైనా సంపాదించుకునే మార్గం ఆలోచించు! లేకపోతే ఎవరి పొలాల్లోనే ఇలాగే ఊడిగం చేసుకుంటూ ఉంటావు!" కర్ర విరిచి చేతిలో పెట్టినట్లుగా నాన్న చెప్పాడు.

నాన్న వెళ్ళిపోవటానికి అటు తిరగ్గానే రాజు "దండం మామయ్య..." అని పిలిచి "చూశావా మామయ్యా, నీ పేరులోని ఒక అక్షరం తీసేస్తే, నిన్ను పిలవటంతో పాటు దండం పెట్టే పని కూడా అయిపోతుంది.." అంటూ నవ్వాడు. "నీ సలహా చాలా బాగుంది మామయ్యా! నేను కొనాలంటే అమ్మేవాళ్ళు ఉండాలిగా, ముందు నీ దగ్గర్నుండే మొదలు పెడతా... ఒక్క ఆర్నెల్లు గడువు చాలు. నువ్వు ఒక్కొక్క ఎకరం అమ్ముతూ ఉండు. నేను కొంటూ ఉంటాను.. సరేనా?"

రాజు మాటలకు ఉరుముతున్నట్లుగా చూసిన నాన్న ఎందుకనో ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

"వీళ్ళిద్దరూ ఎక్కడ కలిసినా ఇదే తంతు అట! మీ నాన్నని కవ్వించడం... రాజుకి అదో సరదా కాబోలు!" అంటూ సుందరి నవ్వింది.

నాన్నకి రాజు అంటే అంత కోపం ఎందుకో.. అనుకున్నాను.

నాకు అంత ప్రేమ ఎందుకని అడిగితే నేను మాత్రం ఏం చెప్పగలను..!

నాన్న వలన రాజు కుటుంబానికి అన్యాయం జరిగిందనే సానుభూతా..?

చిన్నప్పటి చెలిమికి రాజు ఇచ్చిన విలువకు నాలో కలిగిన స్పందనా..?

రాజు అందమా... నాయకత్వ లక్షణాలా.. హాస్య చతురతా... కళల్లో ఉన్న ప్రావీణ్యమా...?

ఏది .. ఏది... నాలో రాజు పట్ల ఏర్పడిన ప్రేమకి పునాది అయిందో... నాకే స్పష్టంగా తెలియదు!

ఏమైనా గానీ నా మనసులోని సంఘర్షణకి ముగింపు పలకాలి! రాజుతో మాట్లాడి ఒక నిర్ణయానికి రావాలి! గట్టిగా అనుకున్నాను.

ఆ రోజు నే వెళ్ళేసరికి అరుంధతి అత్తయ్య ఇంట్లో లేదు. సాధారణంగా ఎక్కడికీ వెళ్ళదు. ఆరోజెవరో వాళ్ళ మనవడి నామకరణానికి రావాల్సిందేనని బలవంత పెట్టి అత్తయ్యను వాళ్ళింటికి తీసుకెళ్ళారట. సత్యం మామయ్య వాళ్ళకి చేసిన సహాయం వల్లనే అప్పట్లో రెండెకరాల భూమి కొనుక్కోగలిగారట. ఇప్పుడు పదెకరాలు సంపాదించుకున్నారు. వాళ్ళ మనవడికి సత్యం మామయ్య పేరే పెట్టుకుంటున్నారట. అదొక విశేషం.

రాజు ఈ మాట చెప్పగానే నాకొక ఆలోచన వచ్చింది.

నాన్న నా పేర పదిహేనెకరాల పొలం రాసేదని నాకు తెలుసు. సత్యం మామయ్య దగ్గర్నుండి అన్యాయంగా సంపాదించినదేగా! నేను మేజర్ని కాబట్టి అత్తమ్మ సాయం, సలహా తీసుకొని ఆ పొలాన్ని రాజు పేర రాయించేస్తే... కొంతైనా న్యాయం చేసినట్లు అవుతుంది కదా!

నా మాటలు వినగానే రాజు మొహం కందగడ్డలా మారిపోయింది! "ఛ..ఛ.. ఏం మాట్లాడుతున్నావ్! మీ నాన్న దారిలోనే నన్నూ నడవమంటావా..? స్వశక్తి మీద నమ్మకం ఉన్న వాళ్ళెవరూ అడ్డదారుల్నీ, ఇతరుల ద్వారా ఆస్తి సంపాదించే మార్గాల్నీ అస్సలు ఇష్టపడరు...!" తీవ్రంగా అన్నాడు.

"అయితే ఇంకొక మార్గం చెప్పనా..?"

"నువ్వేమీ చెప్పొద్దు.." ఆవేశంగా అన్నాడు. క్షణంలో తమాయించుకుని స్వరాన్ని మృదువుగా మార్చుకుని "నువ్వు – మా ఇంటికి రావటం.. మానెయ్యి..." అన్నాడు.

నిర్ఘాంతపోతూ "అదేం..?" అడిగాను.

"ఎందుకంటే..." ఏం చెప్పాలో తోచనట్టుగా ఒక క్షణం అటూ ఇటూ చూశాడు.

"నువ్వు ఈ ఊరు వచ్చినప్పుడల్లా... మా ఇంటికి ఎపుడు వస్తావో అని ఎదురు చూస్తూ ఇంట్లోనే ఎక్కువగా ఉండిపోవటంతో... నా పనులన్నీ ఆగిపోతున్నాయి..." చిరునవ్వుతో అన్నాడు.

రాజు తనంతట తానుగా అడుగు ముందుకు వేయలేడని అర్థమౌతోంది. నా మనసులోని మాట చెప్పటానికి అదే తగిన సమయమనిపించింది.

"నా కోసం ఎదురుచూసే పని లేకుండా, నేనే మీ ఇంటికొచ్చి ఉండిపోయే మార్గం గురించి ఆలోచించకూడదూ...?" అల్లరిగా నవ్వుతూ చూశాను.

నా వేపు విభ్రాంతిగా చూసిన రాజుకు నేనేమంటున్నానో బాగానే అర్థమైందనుకుంటాను. అటు వేపుకు చూస్తూ "తమాషాలు వద్దు.." అన్నాడు. "మన రెండు కుంటుంబాల మధ్యా సత్సంబంధాలు ఉండి ఉంటే మన స్నేహం ఫరవాలేదు. కానీ... మీ ఇంట్లో తెలియకుండా వచ్చి వెళ్ళటం.. ఎవరైనా అపార్థం చేసుకునే అవకాశం ఇచ్చినట్లవుతుంది.." రాజు కంఠం భారమైంది.

"ఇప్పుడు.. ఇప్పుడు చెబుతున్నావా ఈ మాట.. నీతో ఇంత దూరం వచ్చాక..." నా గొంతు రుద్ధమైంది. "ఇప్పుడు తప్పుకుంటావా...?!"

"నేను... నిజమే... తప్పు చేశాననిపిస్తోంది..." రాజు కొంచెంగా తల వంచుకున్నాడు. "నువ్వూ.. ఆ చిన్నప్పటి రోజులూ, మరుగు పడిపోకూడదని.. మనసులో రోజూ తలుచుకుంటూ మెరుగు పెట్టుకుంటున్నందువలనేమో... చాలా నాళ్ళకు నిన్నుచూడగానే... ఒక్కసారిగా వెల్లువై పొంగిన స్నేహాభిమానాలతో చనువుగా ప్రవర్తించాను... తెలిశాక అయినా పొరపాటు సరిదిద్దుకోవాలి కదా..! నువ్వు పుట్టినప్పుడే విష్ణుతో నిశ్చితార్థం జరిగిపోయినట్లేనని విన్నాను!"

"నేను పుట్టకమునుపే మా నాన్న సత్యం మామయ్యకి మాట ఇచ్చాడని.. నేనూ విన్నాను..." నవ్వుతూ అన్నట్లుగా అనబోయాను. కానీ నవ్వు రాలేదు. సీరియస్‌గా చూస్తూ మళ్ళీ చెప్పాను "పుట్టకముందో... పుట్టాకనో... పెద్దవాళ్ళు మాట

ఇచ్చిపుచ్చుకోవటాలూ, ప్రమాణాలూ చేసుకోవటాలూ.. వీటికి విలువేం ఉండదు! కలిసి జీవించాల్సిన పిల్లల ఇష్టాయిష్టాలే ముఖ్యం.. అవునా?"

"నిజమే.. కానీ పెద్దలు అన్ని రకాలుగా ఆలోచించి తీసుకున్న నిర్ణయాలను గౌరవించటం పిల్లలకూ మంచిదే కదూ..! విష్ణు చాలా పై అంతస్థులో ఉన్నాడు...!"

"నేను అంతస్థులు కోరుకోవటం లేదు! ఇప్పటి వరకూ... నీలాగే నేను కూడా ఇది నాకు ప్రత్యేకంగా కావాలని దేనినీ కోరుకోలేదు. ఇప్పుడు మాత్రం... జీవితాంతం నీ సహచర్యం కావాలని గాఢంగా కోరుకుంటున్నాను.. కాదు తపిస్తున్నాను..!" నా గొంతు వణికింది. మనసులోని భావోద్రేకాన్ని తమాయించుకుని మళ్ళీ మెల్లగా చెప్పాను. "ఇప్పటి వరకూ మా మామయ్య నా మాట ఏదీ కాదనలేదు. అత్తమ్మ కూడా అంతే. నన్ను కూతురిలా పెంచింది కాబట్టి... అలాగే నాకు నచ్చిన వ్యక్తితో పెళ్ళి చేసి పంపించమని అడిగితే..కాదనదు.. తప్పకుండా ఒప్పుకుంటుంది! నాకా నమ్మకం ఉంది! ఇక నీ సంగతేమిటో చెప్పు. ఎలాంటి సమస్యలు... ఒడిదుడుకులనైనా తట్టుకుని నిలబడగలననే ధైర్యం.. నేనే కావాలన్న తపన, ప్రేమా ఉంటే.. ఆ మాట చెప్పు..! కాదంటే.. నీమాటను మన్నించి.. నేనెప్పుడూ ఇక నీకు కనుపించను..! నీ నిర్ణయమేమిటో నాకు ఇప్పుడే.. చెప్పాలి!" స్థిరంగా అన్నాను.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా, భారంగా గడిచాయి.

"స్నేహితుడిగా నాకు నీ భవిష్యత్తే ముఖ్యం.." అని చెప్పబోయాడు. నేను మధ్యలోనే కొంచెం గట్టిగానే అడిగాను. "నా భవిష్యత్తుకేం ఫర్వాలేదు.. బ్రహ్మాండంగా ఉంటుంది. నీ మీద నాకా నమ్మకం ఉంది! ఒకటి చెప్పు.. నీకు మానసికంగా ఇంత దగ్గరై.. నిన్ను మనసులో నిలుపుకుని.. విష్ణు బావను పెళ్ళి చేసుకోవటం అంటే.. అది బావకు ద్రోహం చేయటమేగా? బావకెందుకు అలాంటి శిక్ష...?"

రాజు సమాధానం చెప్పలేని వాడిలా నిస్సహాయంగా చూశాడు. ఆలోచనల నుండి తేరుకున్నట్లుగా నేను కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చేసరికి లేచి నిలబడ్డాను. టేబుల్ సొరుగు తీసి .. వెతికి ఒక డ్రాయింగ్ షీట్‌ను తీసి, పెన్నుతో గీసి నా చేతిలో పెట్టాడు.

అంతకు మునుపు నాకు చూపించిన బొమ్మల్లోనిదే.. లంగా ఓణీ వేసుకుని మోకాలిపై తల ఆనించి ఓరగా చూస్తున్న భంగిమలో ఉన్న అమ్మాయి బొమ్మ. క్రింద ఉన్న కవితలో ఒక లైను క్రింద గీత గీశాడు.

ప్రేమ నిండిన నామనసే కోహినూర్

కానుకగా నీకే ఈయనా..

మనసులో ఆనందం ఉవ్వెత్తున ఎగసి పడింది.

ఆ కాగితం మీద ఖాళీ చోటుని చూపించి రాజుని "నేనూ.. ఒక వాక్యం రాయనా..?" అడిగాను. "నిరభ్యంతరంగా." అంటూ పెన్ను నా చేతికి ఇచ్చాడు.

నేను నేనుగా ఉండలేను..

మధువుగా మారి నీమది కలశంలో

నిండిపోనా.. అలా ఉండిపోనా...

ఆ కాగితాన్ని రాజు చేతికి ఇచ్చాను.

ఆశ్చర్యానందాలు ముప్పిరిగొన్నట్లుగా చూసి ... భావోద్వేగంతో దగ్గరకు తీసుకుని నా నుదుటి మీద ప్రేమగా చుంబించాడు.

అన్ని రోజులుగా నాలోని సంఘర్షణ అంతా ఆ క్షణం సమసిపోయి.. స్థిర నిశ్చయానికి వచ్చినట్లుగా మనసు ప్రశాంతంగా మారిపోయింది.

రాజును ఒప్పించినందుకు.. ఏదో గెలుపు సాదించినట్లుగా ఆనందోత్సాహం!

పెద్దవాళ్ల నిర్ణయం పట్ల ఎటువంటి అభ్యంతరం లేకుండా నిశ్చలంగా ఉన్న నా మనసులోకి అడుగుపెట్టి... తన ప్రేమతో అలజడి సృష్టించి... నడిసంద్రంలో వదిలేసినట్లుగా తప్పుకుంటానంటే.. నేనెలా ఒప్పుకుంటానూ...?

"విష్ణు బావ మనసు నొచ్చుకోకుండా.. ఈ విషయం చెప్పాలి! బావంటే నాకు చాలా అభిమానం, గౌరవం! బావ మనసుకు కష్టం కలిగిస్తున్నానేమోననే.. దిగులుగా ఉంది!" అన్నాను.

రాజు చిరునవ్వుతో చూస్తూ "నీకలాంటి దిగులేం అవసరం లేదు. నీ నిర్ణయానికి విష్ణు ఏ మాత్రం బాధపడడు.. నాకు తెలుసు!" ఖచ్చితమన్నట్లుగా అన్నాడు.

"నీకెలా తెలుసు.. ఎందుకలా అనుకుంటున్నావు..?" ఆశ్చర్యంగా అడిగాను.

"నీలాగే విష్ణు కూడా పెద్దవాళ్ళ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాడని నా అభిప్రాయం. నీ పట్ల ప్రేమ ఉండి ఉంటే... మాటలలోనో.. చూపులలోనో ఎప్పుడో అప్పుడు వెల్లడయ్యేది. నీకు తెలిసేది! మీ ఇద్దరి మధ్యా ప్రత్యేకంగా ప్రేమ లేనందువల్లే.. నువ్వు

నా చనువునీ, స్నేహాన్నీ, ప్రేమనీ అంగీకరించి.. స్పందించావు! లేకపోతే.. నాకు దగ్గరయ్యేదానివి కావు! అవునా...?"

నేను ఆశ్చర్యంగా చూస్తుంటే.. "కావాలంటే చూడు.. నువ్వు మన విషయం చెప్పగానే విష్ణు చాలా తేలిగ్గా "నాకేం అభ్యంతరం లేదు.. నీ ఇష్టప్రకారమే జరుగుతుంది అనేస్తాడు.." అంటూనే కుడిచేయి చూపుడు వేలును.. ఏదో రాస్తున్నట్లుగా కదిలించాడు.

నేను నవ్వుతూ "బావ.. ఈ అలవాటు... నీకెలా తెలుసూ...?" అడిగాను.

"ఆ మధ్య ఒకసారి నిన్ను తీసుకునే కాబోలు విష్ణు ఇక్కడకు వచ్చినప్పుడు.. మీ ఇంటి ముందు ఆగి ఉన్న కారుకు జారగిలబడి మీ నాన్న మాటలు వింటూన్నప్పుడు.. ఈ అలవాటును గమనించాను. దగ్గరకొచ్చి గుర్తుపడతాడేమో విష్ణును పలకరిద్దామనుకున్నాను గానీ.. మీ నాన్న ఉన్నప్పుడు ఎందుకులే అనుకుని దూరం నుండి అటే వెళ్ళిపోయాను.." అన్నాడు.

బావా నీకు గుర్తుందిగా.. చెన్నూరు నుండి తిరిగి వస్తున్నప్పుడు నేను దారిలో నీకు చూచాయగా రాజు పేరు చెప్పకుండా.. ఈవిషయం చెప్పినప్పుడు.. నువ్వు సరిగ్గా రాజు అభినయం చేసి చెప్పినట్లే.. నీ అలవాటు ప్రకారం వేలును గాలిలో కదుపుతూ అలాగే చెప్పేసరికి .. రాజు మాటలు గుర్తుకు వచ్చి పెద్దగా నవ్వాను.

నువ్వు కారణం అడిగితే "ఏదో గుర్తుకొచ్చి.. ఏం లేదు.. తరువాత చెబుతాలే.." అనేశాను కదూ! ఎప్పుడో రాజు విషయం అంతా చెప్పాక రాజు మాటల గురించీ చెప్పొచ్చులే అనుకున్నాను.

ఇంతలో అరుంధతి అత్తయ్య వచ్చింది. మాటల మధ్యలో ఎవరి గురించో చెబుతూ "పాపం.. సీతమ్మ దిక్కులేనిదైపోయింది. కొడుకేమో దేశాలుపట్టి పోయాడా.. కనిపెట్టి చూసేవాళ్ళెవరున్నారూ! దయ తలచి ఎవరైనా ఇంత ముద్ద పెడితే... తిని పడుంటోంది. నీతో ఓ మాట చెప్పి... మనతోనే ఉంటుందని, ఇంటికి తీసుకు వద్దామనుకుంటున్నాను..." అంది.

"నేనేదైనా చేయాలనుకుంటే... నీ అనుమతి అడగాలి గానీ, నువ్వు నాకు చెప్పేదేమిటమ్మా! ఒకరు కాకపోతే నలుగురైనా మనకి ఇబ్బందేం ఉంటుందీ.. ఇద్దరికి వండుకునేది నలుగురికని వండుకుంటాం.. అంతేగా!" అన్నాడు.

ఏదో పని చేసుకోవటానికి అత్తయ్య లోపలకి వెళ్ళాక, రాజు నిట్టూరుస్తూ "ఎందుకోగానీ ఒక పీడకల లాంటి భయం నన్ను వెన్నాడుతూంటుంది. నాకేమైనా అయితే అమ్మ ఏమైపోతుందీ అని! పిల్లలు లేని వాళ్ళు... పిల్లలు వదిలేసినవాళ్ళు.. వృద్ధులు ఒంటరిగా బాధపడుతుంటే... చాలా దిగులుగా అనిపిస్తుంది. అలాంటి వాళ్ళ కోసం ఒక ఆశ్రమం కట్టించగలగాలనేది నా కోరిక! నెరవేరుతుందో... లేదో.. ప్చ్" అన్నాడు.

రాజు మాటలు విన్నాక నాకొక ఆలోచన వచ్చింది.

నాన్న అన్యాయంగా లాక్కున్న రాజు వాళ్ళ పొలం నా పేరనే ఉంది కాబట్టి... రాజు కూడ తనకి అక్కర్లేదన్న ఆ పొలాన్ని... రాజు కోరిక తీర్చడానికి మొదటి విరాళంగా ఇచ్చేస్తే... అవును .. చాలా బావుంటుంది! అదే రాజుతో చెప్పాను.

"నువ్వనుకున్నంత తేలిగ్గా పూర్తయ్యే వ్యవహారం కాదులే.. నీకు తెలియదు.." అంటూ రాజు నవ్వాడు.

"నేను గట్టిగా అనుకున్న దానిని తేలిగ్గా వదిలిపెట్టనని నీకు తెలియదులే.." ఛాలెంజింగ్‌గా అన్నాను. "చూస్తూ ఉండు..ఎలా సాధిస్తానో...! నాకు అండగా అత్తమ్మ, మామయ్య రెండు మేరు పర్వతాలున్నాయి..!" తెలుసా అన్నట్లుగా కళ్ళెగరేసాను.

రాజు అలాగే నవ్వుతున్నట్లుగా చూస్తుంటే సీరియస్‌గా చెప్పాను. "నిజం రాజు.. నేను తమాషాగా అనటం లేదు. ఈ క్షణంలోనే నిర్ణయించుకున్నాను. నీ కోరిక తప్పకుండా తీరుతుంది! ఆ బాధ్యత నాది! నా పేరనున్న ఆస్తి.. ఇదే సరిపోదని నాకూ తెలుసు... పెద్ద వాళ్ళ సలహాలు, సహాయం తీసుకొని మనిద్దరం ఎంతైనా కష్టపడదాం! అత్తమ్మ మనకి అండగా ఉంటుంది!"

ఒక క్షణం ఆగి రాజు నవ్వును లెక్క చేయకుండా మళ్ళీ అన్నాను. "వృద్ధుల ఆశ్రమానికీ నేనప్పుడే ఒక పేరు కూడా ఆలోచించాను. మనిషికి ప్రాణాధారం గాలి కాబట్టి నీ పేరూ కలిసి వచ్చేట్లుగా 'సమీరం' అని పెడదాం! లేకపోతే... సేదతీర్చి హాయినిచ్చే అర్థం వచ్చేట్లుగా 'మలయ సమీరం' అని పేరు పెడితే ఇంకా బావుంటుందేమో కదూ? అవునూ... వృద్ధాశ్రమానికి పక్కనే ఒక హాస్పిటల్ కూడా ఉంటే ఉపయోగకరంగా ఉంటుందిగా...?"

"నిజం అవనీ.. కాకపోనీ.. అయినా సరే.. నీ మాటలు వింటోంటే.. నిజంగా అమృతం తాగుతున్నట్లుగా ఉంది లక్ష్మీ...!" రాజు హాయిగా నవ్వాడు.

నాకూ ఆనందంగా అనిపించింది.

నేను ఇంటికి వచ్చేసరికి .. రజిత, పరంధామయ్యగారూ వాళ్ళూ వచ్చి ఉన్నారు.

కాసేపటికే రజిత "నాకప్పుడే బోర్ కొట్టేస్తోంది. సిటీలో ఇంద్రభవనం లాంటి ఇంట్లో ఉంటున్న దానివి.. ఈ ఊళ్ళో.. ఈ ఇంట్లో ఎలా ఉండగలుగుతున్నావే బాబూ..." అంది.

"ఇంద్రభవనం లాంటి ఇల్లు కాదు... అభిమానించే ఆత్మీయులుండాలి.. అది ముఖ్యం! మన ఊరికేం పచ్చని తోటలతో, పొలాలతో ఎంత అందంగా ఉంటుందీ..!" అన్నాను.

"అన్నీ నీకు ముందుగానే అమిరి ఉన్నాయి కాబట్టి ఇలాంటి కబుర్లు ఎన్నైనా చెబుతావులే.." అంది.

రజితకేం తెలుసు.. సిటీని కాదని ఈ ఊరికి.. ఇంద్రభవనం లాంటి శ్రీనిలయాన్ని కాదని అరుంధతి అత్తయ్య వాళ్ళ మండువాలోగిలికి... వస్తున్నానని! మనసులోనే నవ్వుకున్నాను.

పెళ్ళి అయ్యాక రజితా వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ మర్నాడు... అమ్మ ఎవరో బంధువుల ఇంటికి... వాళ్ళమ్మాయి నన్ను తీసుకురమ్మని అడుగుతోందని చెప్పి వెంటబెట్టుకుని వెళ్ళింది. హైద్రాబాద్ నుండి అమ్మగారింటికి వచ్చిన ఆ అమ్మాయి కబుర్లతో నన్ను కదలనీయలేదు. ఇంట్లో పనుందని అమ్మ కాసేపటికే వెళ్ళిపోయింది. ముందు రోజు పెళ్ళితో.. రజితా వాళ్ళు అందరూ ఉండడంతో నాకు నిద్ర సరిపోక అప్పుడు నిద్రొస్తున్నట్లుగా ఉండటంతో అమ్మ వెళ్లిన నాలుగు నిముషాలకే నేనూ వెళ్ళొస్తానని వాళ్ళకి చెప్పి వచ్చేశాను.

అమ్మ లోపలేదో పనిలో ఉంటే... నేను వెనక వరండాలో ఉన్న మంచం మీద పడుకుని ముసుగు పెట్టేశాను. నాకింకా నిద్ర పట్టలేదు. నాన్న వచ్చినట్లున్నాడు... నేనెక్కడ అని అమ్మని గట్టిగా అరుస్తున్నట్లుగా అడిగాడు. నేను వచ్చినట్లుగా తెలియని అమ్మ నేనింకా రాలేదని చెప్పింది.

ఇక్కడికి వచ్చినప్పుడు నేనెక్కడికి వెళ్తున్నదీ ఏమీ తెలుసుకోనక్కర్లేదా? అని నాన్న గట్టిగా అరుస్తుంటే... సుందరి ఇంటికి తప్ప ఇంకెక్కడికీ వెళ్ళదని అమ్మ చెప్పింది.

"అదే నీ తెలివి తక్కువతనం.." అంటూ పెద్దగా కసిరాడు. ఇంతకీ విషయం ఏమిటంటే.. నీతో నా పెళ్ళి నిశ్చయమైనట్లేనని నాన్న ఎవరికో చెబితే, వాళ్ళు 'అమ్మాయి ఇష్టం ఏమిటో కనుక్కున్నారా' అని ఓ మాట అన్నారట. దాంతో నాన్నకి అనుమానం కలిగి ఆరా తీసేసరికి రాజు ఇంటికి నా రాకపోకల సంగతి తెలిసింది. ఈ విషయం నాన్న అమ్మకి చెబితే అమ్మ అమాయకంగా "అయితే మనమ్మాయి ఇష్టం ఏమిటో కనుక్కోనా?" అని అడిగేసరికి నాన్న కోపంతో చిందులు తొక్కాడు. "విష్ణు కంటే పై అంతస్థు వాడయితే ఆలోచిస్తాను గానీ రాజు లాంటి బికారికి అమ్మాయినిస్తానా..?" అంటూ అప్పటి వరకూ అమ్మకూ తెలియని భయంకరమైన నిజాలను వెళ్లగక్కేసాడు!

కొండచరియ విరిగిపడి.. బండరాళ్ళు దడదడా మీద వచ్చిపడుతున్నట్లుగా.. ఆ కఠోర సత్యాలకి నేను నిశ్చేష్టురాలినై బిగుసుకు పోయాను!

ఇంత దారుణమా.. నాన్న ఎలా చేయగలిగాడు..?!

బావా... భూత భవిష్యత్ వర్తమానాలు తెలుసుకోగల మహిమాన్వితుడైన స్వామీజీగా మామయ్య గౌరవాభిమానాలు అందుకున్న వ్యక్తి ఎవరో తెలుసా? ఆ జోగీంద్రస్వామి పూర్వాశ్రమంలో మా అమ్మమ్మ గారి ఊరులో ఒక రైతు దగ్గిర పనిచేసిన పాలేరు! అసలు పేరు జులపాల జగ్గడు! నిజం!

ఏదో దొంగతనం చేసి ఊరి జనంతో తన్నులు తిని పారిపోయాడట. ఆ తర్వాతెప్పుడో నాన్నకి రామేశ్వరంలో సాధువుల గుంపు మధ్య కనిపించాడట గానీ నాన్న గుర్తుపట్టలేదు. వేషం, భాష పూర్తిగా మారిపోయాయి. అతనే తనెవరో చెప్పినా నాన్నకి నమ్మటం కష్టం అయింది. దాంతో నాన్నకి ఒక లాభసాటి వ్యాపార ఆలోచన కలిగింది. దాని ఫలితంగానే ఆ జగ్గడు నాన్న సహకారంతో జోగీంద్ర స్వామీజీ అవతారం ఎత్తాడు! ఊరి వాళ్ళందరి విషయాలూ నాన్నే అతనికి చేరవేస్తుంటాడు. కాబట్టి భూత భవిష్యత్ వర్తమానాలు చెప్పగల స్వామీజీగా పేరు అయాచితంగా వచ్చేసింది! నాన్న తెర వెనుక ఉండి తనకేమీ నమ్మకం లేదన్నట్లుగా మాట్లాడుతూనే బాగా ప్రాచుర్యం కలిగించాడు. ఇంకేముంది... జనం పోటీలు పడి ఊరవతల ఆశ్రమం కట్టించారు. సంవత్సరం పొడుగునా స్వామీజీ అవతారంలో ఉండలేక కర్ణాటకలో ఏర్పాటు చేసుకున్న ఇంటిలో ఉంటూ అప్పుడప్పుడూ ఇక్కడికి వచ్చి వెళ్తూంటాడన్నమాట!

హరిద్వారంలోనో మరెక్కడో దేవాలయాలో, ఆశ్రమాలో కదుతున్నామంటూ విరాళాలూ బాగానే తీసుకొనేవాడు. అందులో అధిక భాగం వాటా నాన్నకే! ఊరి జనం ద్వారా స్వామీజీ మహిమలు మామయ్య తెలుసుకునే ఏర్పాటు చేసి.. తన ప్రమేయం ఏమీ లేదన్నట్లుగా జాగ్రత్తపడ్డాడు. నాన్న చెప్పిన సమయంలో వచ్చి... మామయ్య సమస్యలు తెలుసుకొని వచ్చినట్లుగా నమ్మించి.. నాన్న ద్వారా తెలుసుకున్న విషయాలను చెప్పి.. తోచిన సలహాలివ్వటం... ఇదీ ఆయన చేసే పని! తన సలహాల వల్ల లాభం చేకూరితే... తన మహిమే! లేకపోతే కర్మఫలం అనుభవించక తప్పదనటం... ఇదీ పద్ధతి! మామయ్య తన వ్యాపార విషయాలన్నీ నాన్నతో సంప్రదించే అలవాటు ఉండటం వలన వాళ్ళకి బాగా కలిసి వచ్చే అంశం అయింది!

ఇదంతా అమ్మ నాన్నల సంభాషణ ద్వారా తెలుసుకున్నదే! ఇంకో విషయం కూడా చెబుతాను. నువ్వు తనకి కాబోయే అల్లుడివనే స్వార్థంతో నాన్న ఏం చేశాడో తెలుసా బావా..? నీ జాతకాన్ని బట్టి నీ పేరు మీద ఉంటే కుటుంబానికి శుభమనీ, ఆస్తులు విస్తరిల్లుతాయనీ స్వామీజీ ద్వారా నాన్న మామయ్యకి చెప్పించి శ్రీనిలయమే కాకుండా ఇంకా కొన్ని విలువైన స్థలాల్ని నీ పేర పెట్టించాడట!

తను చేసింది చాలా గొప్ప పని అన్నట్లుగా నాన్న అమ్మతో "మనమ్మాయి భవిష్యత్తు కోసం నేను ఎప్పటి నుండో ఇటుకా ఇటుకా పేరుస్తున్నట్లుగా ఇంత చేసుకు వస్తుంటే.. ఇప్పుడు నువ్వేమో ఎవరో అనామకుడికి కట్టబెడదామంటున్నావా?" అంటున్నాడు.

"అమ్మాయి ఇష్టం కనుక్కోనా అన్నానంతే గానీ రాజు కిచ్చి చేద్దామని నేనేం అనలేదుగా. అయినా ఇపుడు రాజుని.. అనామకుడనుకోవటానికి లేదు. ఎంత మంచి పేరు సంపాదించుకున్నాడో... ! ఊరి వాళ్ళందర్నీ ఒక్కతాటిపైకి తెచ్చాడనీ.. ఊరు కోసం ఎన్నో మంచి పనులు చేస్తున్నాడనీ అందరూ ఒకటే మెచ్చుకుంటున్నారు.. " అంది అమ్మ.

"మెచ్చుకోళ్ళ వల్ల ఒళ్ళోకి ఒరిగిపడే లాభమేమీ ఉండదు గానీ.." అని నాన్న ఏదో అంటూండగానే ఎవరో పిలవటం వినిపించి.. ఏవో కాగితాల కోసం ఇంటికి వచ్చినట్లున్నాడు. అమ్మని అవి తెచ్చి ఇమ్మని అడగటం.. అవి తీసుకుని వెళ్ళిపోవటం జరిగిందని నాకు తెలిసింది. ఇక అలా పడుకుని ఉండలేక అప్పుడే ఇంటికి వచ్చినట్లుగా పని చూసుకుంటున్న అమ్మ దగ్గరకు వెళ్ళాను.

అమ్మ నావేపు పట్టి పట్టి చూస్తున్నట్లుగా ఉండిపోయింది. ఏదో చెప్పాలని అనుకుంటున్నట్లూ.. మళ్లీ చెప్పలేనట్లుగా నిట్టూరుస్తూ అలా అవస్థ పడింది!

నాకు తెలియనట్లుగా ఊరుకోవటమే అప్పటికి మంచిదని నేనూ అనుకున్నాను. ఏదైనా ముందు అత్తమ్మతో చెప్పాలి!

స్వామీజీ మీదున్న నమ్మకంతో, కుటుంబానికి కలిసి వస్తుందని అనుకున్నప్పుడు ఎవరిపేర ఉంటేనేం అనుకుని మామయ్య, శ్రీనిలయాన్ని, ఇంకేవో కొన్ని ఆస్తుల్ని నీ పేర పెట్టి ఉంటాడు. దాని వెనుక నాన్న దురాలోచన, దూరాలోచన ఉన్నాయని ఊహించగలరా అసలు..?!

కొన్ని విషయాలు ఎలాగో తెలుసుకుని చెప్పి... మహిమగా నమ్మించి.. ఎంతటి వాళ్లనైనా వంచించటం ఇంత సులవా..?!

ఎంత చదువుకున్న వాళ్ళయినా, అనుభవజ్ఞులైనా సరే.. కొందరు కొన్ని నమ్మకాల వల్ల... కొందరికి ఇలా దాసులై పోతారుకాబోలు! మనసులో మాటి మాటికీ ఇలా ఆశ్చర్యపోతూనే ఉన్నాను!

ఆ మరునాడే నేను హైద్రాబాద్ వచ్చేశాను. అత్తమ్మకి ఆరోగ్యం బాగా లేదు. నీరసంగా కనిపిస్తోంది. ఏవో మందులు వాడుతున్నానంది. ఆ సమయంలో ఈ విషయాలన్నీ అత్తమ్మకు చెప్పటం మంచిది కాదనిపించింది.

ఇలాంటి నిజాల్ని అత్తమ్మ జీర్ణించుకోగలదా..?! నాన్న మొహం చూడటానికి ఇష్టపడుతుందా? నిదానంగా సమయం, సందర్భం చూసి చెబుదామనుకున్నాను.

రాజు విషయం కూడా అంతే... చెబుదామనుకోవటం... అత్తమ్మ ఎలా రియాక్టవుతుందో అనే సందిగ్ధంలో అప్పటికి వెనకడుగేయటం.. అలా ఆలశ్యం చేశాను.

## 19

అత్తమ్మ, మామయ్య ఏదో మూలికావైద్యం కోసం కేరళ ప్రయాణం పెట్టుకున్నారు. ఆరోజు నాన్న కూడా ఊరు నుంచి వచ్చాడు. అత్తమ్మ నాకు జాగ్రత్తలు చెబుతూ తాళాలు నా చేతికిచ్చి అటు వెళ్ళగానే, నాన్న ఆ తాళాల వేపు చూస్తూ "ఎవరికో గాని ఇలాంటి మహారాణి యోగం దొరకదు. కాలదన్ను కోకు..." అన్నాడు నన్ను హెచ్చరిస్తున్నట్లుగా.

నాకు అర్థమైంది. నాన్నతో ఎందుకులే అని నేను మౌనంగా ఉంటే సరిపోయేదేమో! అలా కాకుండా కవ్వించినట్లుగా అదే నా ఖచ్చిత నిర్ణయమన్నట్లుగా "ఇష్టమైన వ్యక్తితో జీవితాన్ని పంచుకోవటమే నాకు మహారాణీ యోగం.." అని సమాధానం చెప్పాను. అప్పుడే నాన్న "నీకెలా బుద్ధి చెబుతానో చూస్తావుగా.." అని మనసులో శపథం చేసుకున్నాడేమో..!